మోడీ నాలుగేళ్ళ దుష్పరిపాలన

# వాగ్దానాల భంగం - ప్రజలకు ద్రోహం

**ప్రచురణ**

**భారత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్టు), ఆంధ్రప్రదేశ్ కమిటీ**

**27-13-3, సిపిఐ(ఎం) రాష్ట్ర కమిటీ కార్యాలయం, ఆకుల వారి వీధి,**

**గవర్నర్‌పేట, విజయవాడ - 2, ఫోన్ నెం. 0866 2577202, 9490098042**

**ప్రథమ ముద్రణ** : జూన్, 2018

వెల : ₹ 15/-

**ప్రతులకు**

PSBH

**ప్రజాశక్తి బుక్‌హౌస్**

27-1-54, కారల్‌మార్క్స్ రోడ్, గవర్నర్‌పేట,

విజయవాడ -2, ఫోన్ : 0866 -2577533

**బ్రాంచీలు**

విజయవాడ, విశాఖపట్నం, తిరుపతి, గుంటూరు, కాకినాడ,

ఏలూరు, విజయనగరం, ఒంగోలు, నెల్లూరు, కర్నూలు, అనంతపురం

**ముద్రణ**

ప్రజాశక్తి డైలీ ప్రింటింగ్ ప్రెస్, విజయవాడ

website : www.psbh.in

prajasaktipublishinghouse@gmail.com

135312

# విషయసూచిక


| | | |
|---|---|---|
| ❖ | ముందుమాట | 5 |
| ❖ | మహా సంక్షోభానికి బీజం | 10 |
| ❖ | వ్యాపారం సులభతరం చేసే బాధ్యత కార్మికులదే | 16 |
| ❖ | మనుస్మృతే బిజెపి రాజ్యాంగం | 20 |
| ❖ | గిరిజనుల వికాసం శూన్యం | 24 |
| ❖ | మహిళలు : భద్రత లేదు, ఆర్థిక రక్షణ అసలే కరువు | 29 |

# ముందు మాట

**ఈ** ప్రచురణలో మోడీ పాలనకు సంబంధించిన నాలుగు అంశాలను విడివిడిగా ముద్రిస్తున్నాము. 2015 లో మోడీ పాలన మొదలయిన నాటి నుంచి నేటి వరకూ పాలనలో లోపాలను ఎత్తిచూపుతూ వేసిన సీరీస్‌లో ఇది నాల్గవది.

ప్రజల సొమ్ముతో తన పాలన గురించి ప్రచారం చేసుకుంటున్న ఈ సందర్భంలో మోడీ నాలుగేళ్ళ పాలనను అంచనా వేయవలసిన అవసరం మరింత ఎక్కువగా ఉన్నది. ఈ మధ్యనే సమాచార హక్కుతో తెలుసుకున్న వివరాల ప్రకారం, వివిధ మాధ్యమాల ద్వారా మోడీ తన ప్రభుత్వాన్ని ప్రచారం చేసుకోవడానికి రూ. 4343.26 కోట్లు ఖర్చు చేసారు. భర్తలు చనిపోయిన స్త్రీలకు చెల్లించే పెన్షన్ ఒక రూపాయి కూడా పెంచడానికి తన దగ్గర సొమ్ములేదంటూ ప్రభుత్వం నిరాకరిస్తున్న పరిస్థితులలో ఇంత పెద్ద మొత్తం ప్రచారానికి ఖర్చుచేయడం వెగటు కలిగిస్తుంది.

"పేదల పక్షపాతి"గా ఎన్నో విజయాలను సాధించినట్టు, అట్టహాసంగా జరుపుకుంటున్న మోడీ నాలుగేళ్ళ పాలనాసంబరాలను కర్ణాటక యెన్నికల ఫలితాలు కొంత నీరుగార్చాయి.

## వాస్తవం ఏమిటి ?

నాలుగేళ్ళ పాలన గురించి అంచనా వేస్తూ సిపిఎం ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి మొదటి పుస్తకంలో, **ధనికులను మరింత ధనికులగా పెంచే ఒక నమూనాగా మోడీ నమూనా ఎందుకుందో తెలియచేసే ఆర్థిక, విధానపరమైన మౌలిక అంశాల గురించి వివరించారు.** రెండు కోట్ల ఉద్యోగాల మాటేమిటి? అత్యవసర సరుకుల ధరలు అదుపు చేస్తానన్న వాగ్దానాల సంగతేమిటి? జన్ధాన్ యోజన, ఉజ్జ్వల యోజన అనే మోడీ మార్క్ పథకాల అసలు రంగేమిటి? ఈ విషయాలన్నీ ఈ పుస్తకంలో ఉన్నాయి.

కనీవినీ ఎరగని రీతిలో ఈ కాలంలో పెరిగిన అసమానతలు మోడీ పాలనఅసలు స్వరూపానికి అద్దం పడుతున్నాయి. నిజానికి మోడీగారు తన మనసులోమాట (మన్‌కి బాత్) లో ఏనాడూ డబ్బు ప్రస్తావన (ధన్‌కి బాత్) తేలేదు. 2015 లో సామాజిక ఆర్థికసర్వే ఫలితాలను ప్రకటించినప్పుడు 75 శాతం గ్రామీణ కుటుంబాల నెలసరి ఆదాయం రూ. 5000/- కన్నా తక్కువగా ఉందని తేలింది. ఒక ఇంట్లో గనక ఐదుగురు సభ్యులు ఉన్నారని లెక్క వేసుకుంటే మనిషికి రోజుకి రూ. 33/- ఖర్చవుతున్నట్టు లెక్క తేలుతోంది. మరో వైపు క్రెడిట్ సుశి అంచనాల ప్రకారం మోదీగారి పాలనలో భారతదేశంలోని అత్యంత ధనికులుగా ఉన్న ఒక్క శాతం వద్ద పోగుపడిన సంపద పది శాతం పెరిగి 58 శాతానికి చేరుకుంది. అత్యంత ధనికులపై అతి తక్కువ పన్నులు వేయడం, వారి బ్యాంకు అప్పులను రద్దు చేయడం, కార్పొరేట్లకు రకరకాల రాయితీలివ్వడం, సబ్సిడీలివ్వడం వంటి చర్యల ద్వారా ప్రభుత్వం కార్పొరేట్లకు అనుకూలమని తెలియచేస్తున్నది. ఎన్నికలకు ముందు మోడీ రహస్యంగా కార్పొరేట్లకు చేసిన ఈ వాగ్దానాలన్నీ అమలు చేసారు.

ఈ కాలంలో పాలకుల పంచన చేరిన వారి లాభాలు విపరీతంగా పెరిగి ఆశ్రిత పెట్టుబడి బాగా పెరగడాన్ని కూడా చూడగలం. అదానీ వ్యాపారమే ఒక మంచి ఉదాహరణగా చెప్పుకోవచ్చు. 2017 డిసెంబర్ నాటికి వారి సగటు నికర ఆస్తులు 124.6 % పెరిగాయి. క్రిందటి సంవత్సరం అత్యధిక లాభాలను ఆర్జించిన వారిలో ఆయన అందరికంటే పైన ఉన్నాడు. 2015-16, 2016-17 మధ్య కాలంలో బిజెపి ఆదాయం 81.18 %, రూ. 570 కోట్ల నుండి రూ. 1034.27 కోట్లకు పెరగడం యాదృశ్చికం కాదు.

కార్పొరేట్లు సులభంగా లాభాలను సంపాదించుకునేందుకు వీలుగా ప్రభుత్వం చేత రకరకాల విధానాలు రూపొందించడం, తత్ఫలితంగా పాలిత పార్టీకి విరాళాలు కుప్పలు తెప్పలుగా రావడం వెనక ఉన్న ఆంతర్యం లోతుగా పరిశీలించవలసిన అవసరం ఉంది. చెడు సంప్రదాయాల నుండి భారత దేశాన్ని విముక్తి చేస్తానన్న మోడీ వాగ్దానం వాస్తవంలో ఆ చెడు సంప్రదాయాలలో ఎలా తలామునకలుగా కూరుకుని పోయిందో ఈ పుస్తకంలోని ఒక భాగం తెలియచేస్తుంది.

రెండో పుస్తకం **ఆర్‌ఎస్‌ఎస్ కు చేసిన వాగ్దానాలు, అవి బాహాటంగా ప్రజలకు తెలియజేయక పోయినా, ఎలా అమలు చేసిందో తెలియచేస్తున్నది.** కిందటి సాధారణ ఎన్నికలలో మోడీ నాయకత్వానికి తన స్వంత పార్టీలో విబేధాలు ఏర్పడ్డప్పుడు ఆర్‌ఎస్‌ఎస్ ఆయనకు పూర్తిగా అండగా నిలబడింది. భారతదేశ ప్రధాని తన జీవితంలో అత్యధిక భాగం ఆర్‌ఎస్‌ఎస్ ప్రచారకుడుగా ఉన్న విషయం బహిరంగమే.. రాజ్యాంగాన్ని

రక్షిస్తానని ప్రమాణం చేయడానికి ముందే ఆయన ఆర్ఎస్ఎస్ లో తీసుకున్న ప్రమాణానికి, భక్తి గీతానికి కట్టుబడి ఉన్నారు. రెండో పుస్తకంలో మోడీ ప్రభుత్వం హిందూ రాష్ట్రం స్థాపించడానికి బహిరంగంగాను ఆంతరంగికంగాను తీసుకున్న చర్యలను గురించి చర్చించడం జరిగింది. ఈ పుస్తకం రాజ్యాంగంలో మౌలిక అంశాలైన లౌకిక స్వరూపం పైనా, మైనారిటీలపైనా, ప్రజాతంత్ర, స్వయంప్రతిపత్తి గలసంస్థలపైనా, సమాఖ్యపైనా ఎలా దాడులు జరిగాయో వివరించడం జరిగింది.

ప్రస్తుతం రాజ్యాంగంలో సమాఖ్యపై జరుగుతున్న దాడి, రాష్ట్రాల హక్కులను దిగజార్చడం, భారతదేశాన్ని ఒకే కేంద్రం కిందకి తేవాలన్న ఆర్ఎస్ఎస్ ఎజెండాలో భాగంగా గుర్తించబడడం లేదు. హిందీని దేశమంతా రుద్దాలనుకోవడం తీవ్ర ప్రతిఘటనను ఎదుర్కొంది. కానీ ఆ ప్రయత్నాలు ఆగలేదు. ఇదివరకటి కేంద్ర ప్రభుత్వాలు రాష్ట్రాలపై పెత్తనం చేయలేదనికాదు. మోడీ ప్రభుత్వం అన్ని పూర్వపు రికార్డులను తిరగ రాసింది. 15వ ఆర్థిక సంఘానికి చేసిన సిఫారసులను చూస్తే ఈ విషయం స్పష్టంగా అర్థమవుతుంది. ఈ పుస్తకంలో కేరళ ఆర్థిక మంత్రి థామస్ ఇసాక్ 15 వ ఆర్థిక సంఘ సిఫారసులకు సంబంధించిన అన్ని అంశాలను గురించి వ్రాసిన ఒక వ్యాసం ఉంది. ఈ పుస్తకంలో కాశ్మీర్లోని పరిస్థితులకి సంబంధించిన వ్యాసం కూడా ఉంది. కాశ్మీర్ విషయంలో కేంద్ర ప్రభుత్వ విధానాల పూర్తి వైఫల్యం, అందుకు పర్యవసానంగా అక్కడి ప్రజలు పూర్తిగా వేరుపడిపోయిన వైనం తేట తెల్లంగా చెప్పబడింది.

నిజానికి పాలకులు దేశంలోని ఇతర ప్రాంతాలలో తప్పుడు జాతీయవాదం లేవనెత్తేందుకు కాశ్మీర్ని ఉపయోగించుకుంటున్నారు. భారత ప్రభుత్వం తన విదేశాంగ విధానంతో దేశాన్ని "ప్రపంచ శక్తిగా గుర్తించేటట్టు, గౌరవించేటట్టు" చేస్తామన్న వాదనను ఇందులో విశ్లేషించడం జరిగింది. భారత దేశ విదేశాంగ విధానాన్ని మోడీ వ్యక్తిగత సంబంధంగా దిగజార్చి విదేశాంగ విధానం రూపొందించడంలో ఏంతో అనుభవమున్నవారి అనుభవాలను కించపరచినందువలన విదేశాంగ విధానం ఆటుపోట్లకు గురై చిరకాల మిత్రులను స్నేహితులను సంభ్రమాశ్చర్యాలకు గురిచేసింది. మోడీ ప్రభుత్వం అంతకు ముందటి యుపిఎ నాయకత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం లాగానే దేశాన్ని అమెరికా జూనియర్ భాగస్వామిని చేసి ఘోరమైన విధానాలను తీవ్రంగా అమలుచేయడం ప్రారంభించింది. భారతదేశాన్ని అమెరికా వ్యూహాత్మక భాగస్వామిని చేసింది.

బిజెపి ఎన్నికల మేనిఫెస్టోలోగాని, ఆ తరువాత గాని ప్రజలలోని అనేక తరగతులకు, రైతులకు, కార్మికులకు, మహిళలకు, ముఖ్యంగా దళితులకు ఆదివాసీలకు

వివిధ రకాల వాగ్దానాలను చేసింది. ఈ మేనిఫెస్టో అందరికి విద్య, వైద్యం అందిస్తామని కూడా వాగ్దానం చేసింది. ఈ వాగ్దనాలు బిజెపి పరిపాలనకు మంచి రోజులు తెచ్చిపెట్టి ఉండేవి.

మూడు నాలుగు పుస్తకాలలో **ఈ వాగ్దానాలు వాటి అమలు గురించి ప్రస్తావించడం జరిగింది.** ఈ ప్రభుత్వ పాలనలో రైతుల ఆత్మహత్యలు పెరిగాయి. మోడీ ప్రభుత్వం ఉద్యోగులకు కొత్తగా ప్రవేశ పెట్టిన పరిమితకాల నియామకాలు కార్మికులను అవసరానికి తీసుకుని అవసరం తీరగానే తీసివేసే విధానాన్ని ప్రవేశ పెడుతుంది. ఈ పద్ధతిని యజమానులు ఎప్పటినుండో కోరుకుంటున్నారు. పార్లమెంటులో అతి పెద్ద ఏకైక పార్టీగా ఉండి కూడా మహిళా రిజర్వేషన్ బిల్‌ను తొక్కిపెట్టి మహిళలకు తీరని అన్యాయం చేసింది. ఈ ప్రభుత్వ హయాంలో దళితులూ ముందెన్నడూ లేనంతగా జీవనోపాధిని కోల్పోయారు. వారి ఆత్మ గౌరవాన్ని దెబ్బతీసే తీవ్రమయిన దాడులను, ఎదుర్కొన్నారు. అటవీ అధికారాల చట్టంనీరుగార్చబడింది. తరతరాలుగా అడవినే నమ్ముకొని జీవిస్తున్న ఆదివాసీలు ఉన్న వారి స్థానాలనుండి తొలగించ బడుతున్నారు. ఆధార్ ప్రభుత్వానికి ఒక వరంగా మారింది. ఇది ప్రభుత్వం పేద ప్రజలకు అందవలసిన హక్కులు అందకుండా చేయడానికి ఒక ఆయుధంగా తయారయింది. ఈ రెండు పుస్తకాలూ బిజెపి పేదలకు అనుకూలమన్న వాదనను ఆధారాలతో సహా తప్పని రుజువు చేస్తాయి.

మోడీ ప్రభుత్వ విధానాల వైఫల్యాలు ఈ ప్రభుత్వ పాలన అంతం కానున్నదని సూచిస్తున్నాయి.

వామపక్షాలు అనుసరించబోయే ప్రత్యామ్నాయ విధానాలు చెప్పడం ఈ పుస్తకాల పరిధిలో లేదు. ఆ విధానాలకు సంబంధించిన సమాచారం కేరళ, బెంగాల్ త్రిపురలలోని వామపక్ష పాలనలో ఉన్న రాష్ట్రాలలో విరివిగా అందుబాటులో ఉండనే ఉన్నది. ఆసక్తి ఉన్నవారు వాటిని అధ్యయనం చేయవచ్చు. ఇప్పుడు కేరళ లో పినరయి విజయన్ నాయకత్వంలోని వామపక్ష ప్రజాతంత్ర ప్రభుత్వం రెండో వార్షికోత్సవం జరుపుకుంటున్నది. ఈ ప్రభుత్వం తన ఎన్నికల వాగ్దానాలను చాలా వరకు అమలు జరిపి ప్రజాకేంద్రంగా అభివృద్ధి జరగడానికి ఒక నమూనాగా నిలిపింది. వివిధ కారణాల వలన ఎన్నికలలో ఓడిపోయినప్పటికీ మాణిక్ సర్కార్ త్రిపురని ఎన్నో సామాజిక సూచికలలో అగ్రభాగాన నిలిపారు. అంతకు ముందు పశ్చిమ బెంగాల్‌లో వామపక్ష ప్రభుత్వం భూ సంస్కరణలు అమలుచేసి, పంచాయత్ వ్యవస్థను పటిష్ట పరచి చరిత్ర సృష్టించింది. ఈ ప్రభుత్వాలు వివిధ తరగతుల ప్రజల మధ్య సామరస్యాన్ని పెంచి పురోగమనాన్నీ సాధించాయి. అందువలననే బిజెపి – ఆర్ఎస్ఎస్

వామపక్షాలను తమ సైద్ధాంతిక శత్రువులుగా పరిగణిస్తాయి. వారి విష ప్రచారానికి విభజించి పాలించే తత్వానికి అడ్డంకిగా భావిస్తాయి.

ఈ నాడు ప్రజాస్వామ్యాన్ని, సోషలిజాన్ని, ప్రజల హక్కులను కాపాడడానికి అవసరమయిన ప్రత్యామ్నాయ విధానాలకు, ప్రత్యామ్నాయ రాజకీయాలకు వామపక్షాలు ఛాంపియన్స్‌గా ఉన్నాయి. పైన చెప్పిన కారణాల రీత్యా బిజెపి – ఆర్ఎస్ఎస్‌ల విధానాలను సవాలు చేస్తూనే వామపక్ష ప్రజాతంత్ర శక్తుల మధ్య ఐక్యతను సమీకరణ బలాన్ని పెంచుకుని భారతదేశానికి భారత ప్రజలకు అవసరమయిన ప్రత్యామ్నాయ కార్యక్రమాన్ని అభివృద్ధి చేసుకోవలసిన అవసరం ఉంది. ఈ పుస్తకాలను రూపొందించడానికి అనేకమంది కామ్రేడ్స్ ఎంతో శ్రమించారు. సవేరా, శ్యాం, ప్రాంజల్, సోనాలి, ప్రబీర్ పూరకాయత్స్య, రాజేంద్ర శర్మ, బాదల్ సరోజ్, సుభాషిణి అలీ, విజూ కృష్ణన్, రఘు, వెంకటేష్ ఆత్రేయ, జుబిన్ డెన్నిస్, అజయ్ కుమార్‌లకు ధన్యవాదాలు.

ఈ పుస్తకానికి కార్టూన్లు గీసిచ్చిన కార్టూనిస్టులకు కూడా ధన్యవాదాలు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా పోరాడడానికి, రానున్న రోజులలో ఎదురయ్యే సవాళ్ళను ఎదుర్కోడానికి ఈ పుస్తకం ఉపయోగ పడుతుందని ఆశిస్తున్నాను.

**బృందా కరత్**

**మే 2018**

# మహా సంక్షోభానికి బీజం

2014లో నరేంద్ర మోడీ ఎన్నికల ప్రసంగాలు, బిజెపి మేనిఫెస్టో భారతదేశ రైతుల కోర్కెలన్నిటినీ ప్రతిబింబించింది. బిజెపి ప్రభుత్వం రైతుల ఆత్మహత్యలకు చరమగీతం పాడి రైతులకు మంచి రోజులను తెస్తుందని నమ్మబలికారు. "బిజెపి ప్రభుత్వం వ్యవసాయం అభివృద్ధికి చేసేందుకు పెద్దపీట వేస్తుందని, రైతుల ఆదాయాలు పెంచడం, గ్రామీణ అభివృద్ధి తమ ధ్యేయమని సెలవిచ్చారు. ముఖ్యంగా రైతులు పంటకు పెట్టిన పెట్టుబడిపై 50% ఎక్కువ లాభం వచ్చేట్టు చూస్తామని, ప్రభుత్వం పెట్టుబడులు పెడుతుందని, పంటల బీమా అమలవుతుందని, వ్యవసాయ పరికరాలు చౌకగా అందజేస్తామని, నీటి వసతి కల్పిస్తామని, గ్రామీణ రుణపరపతి అందుబాటులోకి వస్తుందని, మహాత్మా గాంధీ గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని విస్తరిస్తామని, పేదరికాన్ని రూపుమాపుతామని, మరెన్నో వరాల జల్లులు కురిపించారు. మోడీ గారి నాలుగేళ్ళ పాలనలో "భారతదేశ అభివృద్ధికి అసలయిన ఈ సాధనం" మూలనపడింది. వారు చేసిన ఈ వాగ్దానాలన్నీ ఒక్కొక్కటిగా విఫలమయ్యాయి. వ్యవసాయంలో ప్రభుత్వ పెట్టుబడులు, గ్రామీణ అభివృద్ధి ఒక్కసారిగా కోతవిధించబడింది; వ్యవసాయ రుణాలు బంద్ చేయబడ్డాయి; వడ్డీవ్యాపారులు రైతుల మూలుగులు పీలుస్తున్నారు; వ్యవసాయ పరికరాల ధరలు చుక్కలు చూస్తున్నాయి; పంటల ధరలు, గిట్టుబాటు ధరలు పెట్టిన పెట్టుబడులకు కూడా చాలక నేలచూపులు చూస్తున్నాయి; సేకరణ యంత్రంగం అంతా నాశనం చేయబడింది; ప్రైవేటు వ్యాపారులను రైతులను దోచుకునేందుకు పూర్తి స్వేచ్ఛనిచ్చారు. ఈ విధమైన అడ్డంకులు లేకుండా, రైతుల ప్రయోజనాలను పణంగా పెట్టి, ఆహార భద్రతను కూడా గాలికొదిలేసి కార్పొరేట్లు విచక్షణారహితంగా భూమిని పొందేందుకు చర్యలు తీసుకోవడం ఆనవాయితీగా మారింది. వ్యవసాయ కూలీలకు, చిన్న సన్నకారు రైతులకు పెన్షన్ లాంటి సంక్షేమ చర్యలు ఏమి తీసుకోలేదు. బిజెపి పరిధిలో కూడా వ్యవసాయ

కార్మికుని వేతనాల అంశం లేదు; వాటిని పెంచే ప్రయత్నమేదీ చేయలేదు.

## వ్యవసాయ అభివృద్ధి

గత నాలుగేళ్లలో వ్యవసాయ అభివృద్ధి ఎగుడు దిగుడులతో కూడుకుని ఉంది. 2013 - 14 లోని 5.6% నుండి 2014-15లో-0.2 శాతానికి పడిపోయింది. 2015 -16 ఉన్న 0.7% నుండి 2016-17 లో 4.9% పెరిగింది. 2017-18లో 2.1% పెరుగుతుందని అంచనా. ఇంత తక్కువ స్థాయిలో అభివృద్ధి జరుగడం వ్యవసాయంపై వచ్చే ఆదాయాలపైన తీవ్రమయిన ప్రభావం చూపెడుతుంది; వారు పొలాల్లో పండించడానికి అవసరమైన పెట్టుబడులకు రుణాలు సమకూర్చుకోవడం కూడా కష్టమవుతుంది. ఈ లెక్కలు కూడా ఆర్థిక రంగంలో. అవకాశాలే ఎక్కువ. ఎందుకంటే నోట్ల రద్దు తరువాత కూడా ప్రభుత్వం వృద్ధి రేటు ఎక్కువగా చూపించుకుంది.

రైతుల ఆదాయాలు 2022 నాటికి రెట్టింపు కావాలన్నా లక్ష్యం చేరుకోవాలంటే ఏడాదికి కనీసం 14.86% అభివృద్ధి ఉండాలంటున్నారు ఆర్థిక శాస్త్రవేత్తలు. నీతి ఆయోగ్ ఆర్థిక శాస్త్రవేత్తలు దీనితో విభేదించి ఏడాదికి 10.4% వృద్ధి ఉంటే 2022కు వ్యవసాయ ఆదాయాలు రెట్టింపు చేసుకోవచ్చన్న లక్ష్యాన్ని చేరుకోవచ్చన్న అంచనాకు వచ్చారు. అదే నిజమనుకున్నాగాని మనం లక్ష్యానికి ఇంకా చాల దూరంలోనే ఉన్నాము. వాళ్ళ మాటలలోని డొల్లతనం ఇప్పుడు బయట పడుతోంది.

## ఆత్మహత్యలు

రైతుల ఆత్మహత్యలు నిలువరించడం లక్ష్యం చేరకపోవడం అటుంచి ఏటికేడాది పెరుగుతున్నాయికూడా. కొన్ని రాష్ట్ర ప్రభుత్వాలు గణాంకాలను తారుమారు చేసి పరిస్థితి సక్రమంగా ఉన్నట్టు చూపే ప్రయత్నం చేస్తున్నప్పటికి వాస్తవం అందుకు భిన్నంగా ఉంది. బిజెపి ప్రభుత్వ హయాంలోని మొదటి మూడేళ్ళలో 36000 మంది రైతులు ఆత్మహత్యలకు పాల్పడ్డారు. బిజెపి అధికారంలో ఉన్న మహారాష్ట్రలో 11956 మంది రైతులు ఆత్మహత్యలు చేసుకున్నారు. అంటే మొత్తం ఆత్మహత్యలలో మూడో వంతన్నమాట. ఎన్‌సిఆర్‌బి గణాంకాలకు పంజాబ్‌లోని విశ్వవిద్యాలయాలు స్వతంత్రంగా చేసిన సర్వే గణాంకాలకు చాలా తేడా ఉంది. 2014 నుండి పంజాబ్‌లో రైతుల ఆత్మహత్యలు 459 అని ఎన్‌సిఆర్‌బి లెక్క వేయగా విశ్వవిద్యాలయాలు ఇంటింటికి జరిపిన సర్వేలో ఏడాదికి వెయ్యికి పైగా రైతులు ఆత్మహత్యలు చేసుకుంటున్నారని వెల్లడైంది. 2015, 2016లలో బెంగాల్‌లో రైతుల ఆత్మహత్యలే లేవని, బీహార్‌లో 2016 లేవని ఎన్‌సిఆర్‌బి లెక్కలు చెపుతున్నాయి. ఇవి వాస్తవాలు కాదు. ఎంత తక్కువగా రైతుల ఆత్మహత్యలు జరుగుతున్నట్టు చూపించే ప్రయత్నం

చేసినా రైతుల ఆత్మహత్యలు పెద్ద సంఖ్యలో జరుగున్నాయన్నది యదార్థం.

## ఉత్పత్తి ఖరీదుపై 50% లాభాలు

పండించిన ఖరీదుకన్నా 50 % లాభం వచ్చేట్టు (స్వామినాథన్ కమిటీ సిఫారసు) ధరలు నిర్ణయించడం జరుగుతుందని చేసిన వాగ్దానం నుండి బిజెపి ప్రభుత్వం వెనక్కు పోయింది. 2015 ఫిబ్రవరి20వ తేదీన పంట పండించే ఖర్చు కన్నా 50% ఎక్కువ ఇస్తే మార్కెట్ ధరలు వక్రీకరించబడతాయని అందువలన కనీస మద్దత్తు ధరను పెంచడం సాధ్యం కాదని సుప్రీం కోర్టులో అఫిడవిట్ సమర్పించింది. ఈ మధ్యనే ప్రభుత్వం తాము పంట పండించిన ఖర్చులకన్నా 50% ఎక్కువ ఇప్పటికే ఇస్తున్నట్టు ప్రకటించింది. ఇది పచ్చి బూటకం. పంట పండించే ధరలను బాగా తక్కువ చేసి చూపడం వల్ల చెప్తున్నది. ఈ రెంటి మధ్య తేడా 32% ధాన్యంలోను, 34% జొన్నలలోను, 39% మొక్క జొన్నలలోను ఉంది. చాలా సందర్భాలలో రైతులు వంద రూపాయలు పెట్టుబడి పెడితే 80 రూపాయలు పొందుతున్నారు. అయితే కనీస మద్దతు ధర ఉపయోగం ఆచరణలో సూన్యం ఎందుకంటే అసలు సేకరణలు లేవుకదా ! పండించే రైతులలో 86% చిన్న, సన్నకారు రైతులే. వీరిదగ్గర తాము ఖర్చు చేసే దాని కన్నా ఎక్కువ పంట అమ్మేందుకు ఉండదు. అంటే కనీస మద్దతు ధర తో వీరికి ఏ సంబంధం లేదు . ప్రభుత్వం తాను ప్రకటించిన కనీస మద్దతు ధర అమలు చేయని కారణంగా రైతులు ప్రముఖ పంటల్లో 2017-18 ఖరీఫ్, రబీలలో 3,00,000 కోట్లు నష్టపోయారని ఒక అంచనా - రైతులు తాము మార్కెట్‌లో పొందిన దానికీ మోడీ తన మాట మీద నిలబడి తాను ప్రకటించిన విధానం అమలు చేసి ఉంటే రైతులు పొంది ఉండే మొత్తానికీ మధ్యనున్న తేడా అన్నమాట.

## వ్యవసాయ కూలీల వేతనాలు

బిజెపి ప్రభుత్వం దేశంలోనే అతి పెద్ద రంగమైన వ్యవసాయ రంగంలో అత్యధికులు పనిచేస్తున్న వ్యవసాయ కూలీలకు ఒరగబెట్టింది ఏమీలేదు. వారు అత్యంత పేదరికంలో ఉన్నారు. విపరీతంగా దోపిడీకి గురవుతున్నారు. వారిలో ఎక్కువమంది దళితులూ ఆదివాసీలు. వారి అసలైన డిమాండ్ భూమి. దానిమాట అటుంచి తక్షణ డిమాండ్ అయిన వేతనాల పెరుగుదలను కూడా మోడీ ప్రభుత్వం పూర్తిగా విస్మరిస్తోంది. వ్యవసాయ కార్మికుల పరిస్థితి అత్యంత దారుణంగా ఉంది. అయినా పెద్ద రైతులు కూలీలకు జీతాలు ఎక్కువ చెల్లిస్తున్నట్టు వాపోతుంటారు. ఈ మధ్య అధ్యయనాలు 2007-08 నుండి 2014-15 మధ్యకాలంలో కూలీలు కొంత పెరిగాయి. కానీ మోడీ గారి హయాంలో నిలకడగా ఉండిపోయాయి. ఇది అత్యంత కష్టాన్ని, బాధలను తెచ్చిపెడుతోంది. కానీ ప్రభుత్వం ఉపశమనం మాట అటుంచి కనీసం ఓ ఓదార్పు మాట కూడా అనడం లేదు.

**వ్యవసాయ కార్మికుల వేతనాలు వ్యవసాయ కార్మికుల నిజవేతనాలలో పెరుగుదల. (2014-2015 నుండి 2016-17) వరకు.**

| | | %మార్పులు |
|---|---|---|
| దున్నినందుకు | మగ | 1.7 |
| విత్తనం నాటడం, కలుపు తీయడం, నారు పోయడం | మగ | 3.1 |
| | ఆడ | 5.0 |
| కోతలు, తూర్పుర పట్టడం, నూర్పిడి | మగ | 0.5 |
| | ఆడ | 0.3 |
| నైపుణ్యం లేనిపని | మగ | 2.0 |
| | ఆడ | 4.7 |

## గ్రామీణ ఉపాధి హామీ పథకం

గ్రామీణ ఉపాధి హామీ పథకాన్నీ వ్యవసాయానికి జోడిస్తానని బిజెపి మాటిచ్చినా ఆ దిశగా ఏమీ అడుగు వేయలేదు. ఉపాధి హామీ పథకాన్ని విస్తరించే పనిగాని, పరిపుష్టం చేసే పనిగాని జరగలేదు. ఈ మధ్యనే ప్రవేశపెట్టబడిన కేంద్ర బడ్జెట్‌లో సహితం అదనపు నిధులు కేటాయించలేదు. ఈ సారి కేటాయించిన రూ 55,000 వేల కోట్లు అంతకుముందు సంవత్సరం కేటాయించినవే. ఈ పథకం గనుక సరిగ్గా అమలు చేయాలంటే కనీసం రూ 80 వేల కోట్లవుతుందని అంచనా. 2016-17లో 15% ఉపాధి కోరుకున్న వారికి లభించలేదు. ఉపాధి పొందిన వారిలో 56% మందికి ఇంకా వేతన బకాయిలు ఉన్నాయి. అయినప్పటికీ ప్రభుత్వం ఇంత నిర్లక్ష్యంగా వ్యవహరించి కేటయింపులు చేస్తుంది. 2018 జనవరి 25 వతేదీ నాటికీ ఎనిమిది రాష్ట్రాలు ఉపాధిహామీ పథకం అమలు చేస్తూ రూ. 1555 కోట్ల నికర లోటులో ఉన్నాయి. అంటే వారు కేంద్రం నుండి పొందిన నిధుల కన్నా ఎక్కువ ఖర్చు చేశారు. 2016-17 లో 89 మిల్లియన్లు ఉపాధి కోసం ఎదురుచూడగా 76 మిలియన్లు ఉపాధి పొందారు. రాష్ట్రాలు నిధుల కేటాయింపులలో విపరీతమైన కోతలు ఎదుర్కొంటున్నాయి. చట్టంలో సూచించినన్ని పనిదినాలు పని కల్పించడం లేదు. ఈ సమస్యలను ఏమాత్రం పట్టించుకోకుండా 321 కోట్ల పని దినాలు ఉపాధి కల్పించామని ఏ రకమైన నిర్దిష్టమయిన ప్రణాళికలు లేకుండా మాట్లాడితే నమ్మడం ఎలా? 2017-18లో నమోదైన వారి నుండి 1.62 కోట్ల మందిని పని పొందే జాబితా నుండి తొలగించడం జరిగింది. అస్సాంలో కుటుంబానికి 29 పని దినాలు, బీహార్‌లో 36, ఝార్ఖండ్‌లో 41, ఒరిస్సాలో 40 సరాసరి పనిదినాలు కల్పించబడ్డాయి. 2017-18లో ఈ పథకం సరాసరి 45 రోజుల పనిదినాలు కల్పిస్తే, కరువు ఎక్కువగా

ఉన్న సంవత్సరం  2015-16లో 49 రోజులు కల్పించింది. గ్రామీణ ఉపాధిలో వేతనాలు కనీస వేతనాల కన్నా 27 రాష్ట్రలలోను, కేంద్రపాలిత ప్రాంతాలలోను తక్కువే.

## నిధులు : బడ్జెట్, బ్యాంకురుణాలు, బీమా

అభివృద్ధి తప్పటడుగులు వేస్తున్నా, ఆర్థిక సర్వే రాబోయే రోజులలో పర్యావరణ మార్పులవలన వ్యవసాయంపై ఆదాయం సరాసరి 15 నుంచి 18 శాతం తగ్గుతుందని, నీటి సదుపాయాలు లేని చోట్ల 20 నుంచి 25 % దిగుబడి తగ్గనుందని హెచ్చరికలు చేస్తున్నా బడ్జెట్‌లో వ్యవసాయానికి కేటాయింపులు 2.36% నికి మించి జరగడం లేదు. రాష్ట్రీయ కృషి వికాస్ యోజనలో ఒకేసారి రూ.4500 కోట్ల నుండి రూ.3600 కోట్లకు తగ్గించారు. ఇది స్వాతంత్ర్యం వచ్చిన నాటి నుండి అతి తక్కువ కేటాయింపు. ధరల్లో హెచ్చుతగ్గులను సరిచేయడానికి ధరల స్థిరీకరణ నిధిని గురించి గొప్పగా చెప్పుకుని, దానికి చేసిన కేటాయింపులు తీవ్ర కోతకు గురయ్యాయి. 2016-17లో రూ.6500 కోట్లు కేటాయించగా 2018-19లో రూ.1500 కోట్లే కేటాయించారు. ఇది రబ్బర్, తేయాకు, కాఫీ, మసాలా దినుసులు లాంటి వాణిజ్య పంటలు పండించే రైతులకు తీవ్ర నష్టాన్ని కలిగిస్తోంది.

41 శాతం వ్యవసాయ రుణాలు (రెండు లక్షల రూపాయల  లోపు),  చిన్న సన్నకారు రైతులకు అందించగా 14% రుణాలు, కోటి కన్నా ఎక్కువ రుణాలను వ్యవసాయోత్పత్తిలో పాల్గొంటున్న కార్పొరేట్లకు అందిస్తున్నారు. అందువల్లనే రైతుల అప్పులు పెరిగి ఆత్మహత్యలకు దారితీస్తోంది. ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన పుణ్యమా అని రూ.21వేల కోట్ల ప్రీమియం బీమా కంపెనీలకు పోయి, కాగ్ నివేదిక ప్రకారం  వారికి  రూ. పదివేల కోట్ల లాభాలను తెచ్చిపెట్టింది. మరో వైపు రైతులు పంటల నష్టాలలో మునిగి తేలుతున్నారు.

## నీటి సదుపాయం

"ప్రతి పంటకు నీరు" అన్న నినాదం ఎక్కువ రాష్ట్రాలు కరువుతో అల్లాడుతుండడం వల్ల ప్రాముఖ్యతను సంతరించుకుంది. ఇది  ప్రధాన మంత్రి కృషి సించయ్ యోజనలో భాగం. ఈ మధ్య జరిగిన ఒక సర్వేలో ఈ పథకం కేవలం ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, మహారాష్ట్ర, తమిళనాడు  రాష్ట్రాలలో మాత్రమే పనిచేస్తున్నట్టు కనుగొనడం జరిగింది. 2017-18లో నీటిసదుపాయం ఉన్న ప్రాంతంలో ఇవి 78% భూమిని కలిగి ఉన్నాయి. 2017-18లో బీహార్ కేవలం 86 హెక్టార్లను మాత్రమే అదనంగా కలుపుకోగలిగింది. ఈ పథకం లో 40% ఖర్చును రాష్ట్రాలు పెట్టుకో

వలసి రావడం ఈ పథకం విఫలమవడానికి ప్రధాన కారణంగా చెప్పబడుతోంది.

నరేంద్రమోడీ ఆధ్వర్యంలోని బిజెపి ప్రభుత్వం కేవలం కార్పొరేట్ల లాభాల గురించే పని చేస్తున్నది. రైతుల నోట్లో మట్టి కొడుతోంది. వారి మీద పెట్టుకున్న ఆశలన్నీ అడియాశలయ్యాయి. బిజెపి ప్రభుత్వం రైతు వ్యతిరేకి అని ఎక్కువమంది రైతులు బలంగా నమ్ముతున్నారు. ఈ మచ్చను బిజెపి ప్రభుత్వం తుడిచి వేసుకోలేకపోతోంది. కష్టజీవుల, రైతుల భారీ పోరాటాలు స్వాతంత్ర భారతదేశంలో, రైతు వ్యతిరేక ప్రభుత్వానికి చరమగీతం పాడుతాయి.

❖

# వ్యాపారం సులభతరం చేసే బాధ్యత కార్మికులదే

**బి**జెపిని నిందించలేని ఒకే ఒక అంశం – కార్మికులు ఎందుకంటే 2014 సాధారణ ఎన్నికలలో వారు కార్మికులకు ఏ వాగ్దానమూ చేయలేదు. “పెట్టుబడిదారులకు అనువైన పరిస్థితులు కల్పిస్తాము”. ఆ తరువాత “కార్మికులు”– అభివృద్ధికి మూలస్తంభం, అని రెండు పేరాలు నాలుగు బులెట్ లైన్లు ఉన్నాయి. కార్మికులు పారిశ్రామిక వేత్తలు ఒక పెద్ద కుటుంబానికి చెందిన వారని చెప్పడం జరిగింది. అసంఘటిత కార్మికులకు గుర్తింపు కార్డులు ఇస్తామని, “కాలంచెల్లిన” కార్మిక చట్టాలను మార్చివేస్తామని చెప్పడం జరిగింది. వారు చేసింది కూడా అదే.

మోడీ ప్రభుత్వం దేశంలోని కార్మికుల మీద పాశవికంగా దాడులు ప్రారంభించింది. నిజ వేతనాలు తగ్గుతున్నాయి. క్రమబద్ధమైన పనులు కాంట్రాక్టు పనులుగా మారుతున్నాయి. కార్మిక చట్టాలను ధ్వసం చేశారు. ప్రభుత్వరంగం ప్రైవేటీకరించబడింది. కార్మికులలో మహిళల శాతం గణనీయంగా తగ్గింది. జాతి ఎజెండా నుండే కార్మికులను తప్పించడం జరిగింది. దేశీయ విదేశీ పెట్టుబడిదారులకు దోపిడీ చేసుకోడం సులభతరం చేయడం మొత్తం అన్ని విభాగాలలోనూ కనిపిస్తుంది. పెద్ద నిరుద్యోగ సైన్యాన్ని తయారుగా ఉంచి కార్మికులను ఎప్పుడైనా తీసేయవచ్చనే పరిస్థితిని కల్పించి, వేతనాలు తక్కువ స్థాయిలో ఉంచుతున్నారు. ఎవరైనా సంఘం ఏర్పాటు చేస్తే, లేదా చట్ట పరమైన చర్యలకు పూనుకుంటే వారికి దారులు మూసివేయబడతాయి. కార్మికులను బెదిరించేందుకు నిరుద్యోగ సైన్యాన్ని సిద్ధంగా ఉంచుతున్నారు. మోడీ ప్రభుత్వం పెట్టుబడిదారులకు అనువైన వాతావరణం కల్పిస్తానన్న మాట నిలబెట్టుకుంది.

**మోడీ ప్రభుత్వం కార్మికుల దాడి స్వరూపం**

**1. అతి తక్కువ వేతనాలు** : ఎన్నో విన్నపాలు, నిరసనలు, పది కేంద్ర

సంఘాలచే రెండు భారీ సాధారణ సమ్మెలు, జరిగినా ప్రభుత్వం కనీస వేతనాన్ని రూ. 18వేలకు నిర్ణయించడానికి ఒప్పుకోలేదు. ప్రభుత్వమే నియమించిన ఏడవ వేతన కమిషన్ ఇండియన్ లేబర్ కాన్ఫెరెన్స్, సుప్రీంకోర్టు ఇచ్చిన మార్గదర్శకాల కనుగుణంగా కనీస వేతన సూత్రాన్ని రూపొందించింది. కనీసవేతనం చాలామందికి రూ. 6000/- నుండి రూ.10000/- లోపు ఉండిపోతున్నది. జీతాల పెరుగుదల నిలిచిపోయింది. కార్మికుల జీతాలు వాస్తవంలో స్తంభించిపోయాయి.

**2.కాంట్రాక్టు కార్మికులు:** ఇప్పుడు ప్రభుత్వ సంస్థలలో మూడో వంతు కార్మికులు కాంట్రాక్టు పద్ధతి లోనే పనిచేస్తున్నారు. స్టీల్, కోల్, గ్యాస్, టెలికం, పోర్ట్, డాక్, వస్త్ర, జనుము రంగాలలో, తోటలలో, సమాచార శాఖలోని ప్రైవేటురంగంలో 40 నుండి 60% కాంట్రాక్టు కార్మికులను నియమించుకుంటున్నది. సాధారణంగా కాంట్రాక్టు కార్మికుల వేతనాలు 30 నుండి 50% తక్కువగా ఉంటాయి. యజమానులు దయాదాక్షిణ్యాలపై ఆధారపడడమే కాక వారికి సాధారణ ఉద్యోగులకు ఉండే అనేక ఇతర సదుపాయాలు కూడా ఉండవు. 2016 లో సుప్రీంకోర్టు కాంట్రాక్టు పనివారికి కూడా పర్మనెంట్ కార్మికులతో సరిసమాన వేతనాలు, ఇతర సదుపాయాలు ఇవ్వాలని రూలింగ్ ఇచ్చినప్పటికీ దాని అమలుకు ప్రభుత్వం ఏ చర్యా తీసుకోలేదు.

**3. అసంఘటిత కార్మికులు :** మన దేశంలో 93 % కార్మికులు అసంఘటిత రంగానికి చెందిన వారే. నిర్మాణ రంగంలోనూ, రవాణా రంగంలోనూ, హొటల్ లలోను, ఇంటినుండి పనిచేసే అనేక పనులలో వీరున్నారు. వారి జీతాలు దయనీయంగా ఉన్నాయి. పనిపరిస్థితులు అధోగతిలోనూ జీవన పరిస్థితులు అధ్వాన్నంగానూ ఉన్నాయి. వీరిలో అత్యధికులు వలస కార్మికులు. గ్రామాలలో వ్యవసాయ సంక్షోభం కారణంగా పనులు లేక, ఉపాధి కరువై పొట్ట చేతపట్టుకుని ఉన్న ఊరు బలవంతంగా వదిలినవారు. పోరాటాల ద్వారా పొందిన కాసిన్ని సదుపాయాలు అమలుకు నోచుకోవడం లేదు. ఉదాహరణకు ఈ మధ్యనే రాష్ట్ర ప్రభుత్వాలు సెస్ ద్వారా రూ. 37,400 కోట్లు నిర్మాణ రంగ కార్మికుల దగ్గరి నుండి వారి పిల్లల చదువులకు, మెరుగైన ఇల్లు కట్టుకోవడానికి ఇతర ప్రయోజనాలకు సమకూర్చడానికి బిల్డింగ్ అండ్ అదర్ కన్స్ట్రక్షన్ వర్కర్స్ వెల్ఫేర్ ఫండ్ చట్టం కింద వసూలు చేసినదానిలో రూ. 9000 కోట్లు మాత్రమే ఖర్చు చేశాయని మిగిలిన దానిలో సింహభాగం పరిపాలనా ఖర్చులకు ఇతర ఖర్చులకు ఉపయోగించారని సుప్రీంకొర్టు మందలించింది.

**4. స్కీం వర్కర్స్ :** పేదలకు కనీస సౌకర్యాలైన విద్య, ఆరోగ్యం, పోషకాహారం మొదలైనవి కల్పించేందుకు, దాదాపు కోటి మందిని ప్రభుత్వం (ఇందులో అత్యధికులు స్త్రీలే), నియమించింది. కానీ వీరిని ప్రభుత్వం ఉద్యోగులుగా గుర్తించడానికి నిరాకరిస్తోంది. వారికి "గౌరవ వేతనం", లేదా "ఇన్సెంటివ్" ల పేరుతో అత్యల్ప

వేతనాలు ఇస్తోంది. వారికి సామాజిక భద్రత కల్పించడం లేదు. అంగన్వాడీల వేతనాలు పెంచుతామని వాగ్దానం చేసినప్పటికీ బిజెపి ప్రభుత్వం ఏమీ పెంచలేదు. 2011 నుండి వారి వేతనాలలో మార్పులేదు. అదనంగా బిజెపి ప్రభుత్వం ఈ ఖర్చులలో కేంద్ర ప్రభుత్వ వాటాను తగ్గించివేసింది. కాలక్రమంలో ఈ పథకాలను రద్దు చేసి ప్రైవేటు వారికీ అప్పచెప్పే ప్రయత్నంలో ఉంది.

**5. నిరుద్యోగ సైన్యం :** "మేక్ ఇన్ ఇండియా" "స్కిల్ ఇండియా" "స్టార్ట్ అప్ ఇండియా" లాంటి నినాదాలు ఎన్ని ఉన్నా మోడీ ప్రభుత్వం ఉద్యోగాలను కల్పించడంలో తీవ్రంగా విఫలమైంది. డిగ్రీ అంతకు పైన చదువుకున్న వారిలో నిరుద్యోగం 28% ఉంది. స్టీల్, నిర్మాణం, టెలికాం, తోలు, వ్యవసాయోత్పత్తుల ప్రాసెస్సింగ్ వగైరా పరిశ్రమలలో అధిక సంఖ్యలో ఉద్యోగాల తొలగింపులు గురించి తరచుగా వార్తలు వస్తున్నాయి. సిఎంఐ ఈ ప్రకారం నిరుద్యోగం దాదాపుగా 7% ఉంటుంది. అయితే లేబర్ బ్యూరో లెక్కల ప్రకారం చదువుకు, నైపుణ్యానికి తగిన ఉద్యోగాలు 37 శాతం మందికి దొరకడంలేదు. మహిళలలె ఉద్యోగిత ఎన్నడూ లేని విధంగా 27% నికి చేరింది.

**6. ప్రైవేటు పరం :** ప్రభుత్వం రూ 1.96 లక్షలకోట్ల ప్రభుత్వ రంగ సంస్థ ఆస్తులను ప్రైవేటు వ్యక్తులకు అమ్మివేసింది. ఇది యుపిఎ ప్రభుత్వం పదేళ్లలో అమ్మినదానికంటే ఎక్కువ. ఆయుధ తయారీ, రైల్వేస్ వంటి కీలక పరిశ్రమలలో సైతం విదేశీ, స్వదేశీయులకు భాగస్వామ్యం కల్పించింది. కార్మికులకు సంబంధించినంత వరకూ ప్రైవేటుపరం చేయడమంటేనే ఉద్యోగాలు ఊడిపోవడం, ఉద్యోగాల నియమ నిబంధనలు మారిపోవడం, రిజర్వేషన్ల అమలు మానివేయడం. దేశం స్వయం సంవృద్ధి సాధించలేక పోవడం, సార్వభౌమత్వాన్ని కూడా పణంగా పెట్టడం.

**7. కార్మిక చట్టాల సవరణలు :** మోడీ ప్రభుత్వం అత్యుత్సాహంగా అమలు చేసినవి కార్మిక సంస్కరణలు. ఇవి రెండు స్థాయిలలో జరిగాయి. కేంద్రం. రాష్ట్రం. ఎందుకంటే కార్మికులు ఉమ్మడి పట్టికలో చేర్చబడ్డారు. కేంద్రంలో ఉన్న 44 కార్మిక చట్టాలను నాలుగు కార్మిక కోడ్‌లలోకి కేంద్రం కలిపివేసింది. అందువల్ల యజమానులు ఉద్యోగులను అవసరానికి తీసుకోవడం, అక్కరలేనప్పుడు తొలగించడం చేయవచ్చు. ఈ మార్పు ముఖ్యఉద్దేశ్యం అత్యధిక కార్మికులకు ఏ విధమైన చట్ట రక్షణ లేకుండా చేయడం. వారెంతో కష్టపడి సాధించుకున్న హక్కుల పరిధి నుండి వారిని తొలగించడం. ముందుగా వస్త్ర పరిశ్రమలో అమలుచేసిన, నిర్ణీత స్థిరమైన కాల వ్యవధి ఉద్యోగాలను Fixed term employment బిజెపి ప్రభుత్వం ఇతర రంగాలకు కూడా వర్తింప జేసింది. క్రమంగా స్థిరమైన ఉద్యోగం అన్నది ఒక గత చరిత్రగా మిగిలిపోనుంది. కార్మికులు ఎప్పుడు ఉద్యోగాలు పోతాయో అన్న భయంతో

గడపాల్సివస్తోంది. సామాజిక భద్రతా కోడ్ గురించి గొప్పగా చెపుతున్నప్పటికీ అందులో ప్రభుత్వ నిధుల కేటాయింపులు లేవు. ఇందులోని అసలు ఉద్దేశం కార్మికుల డబ్బును స్టాక్ మార్కెట్‌లోకి తరలించడమే.

**8. రాష్ట్రాలలో కార్మిక చట్టాలు :** రాజస్థాన్ రాష్ట్రం అనేక కార్మిక చట్టాలను సవరించింది. అందులో కొన్ని పారిశ్రామిక వివాదాల చట్టం, ఫ్యాక్టరీ చట్టం, కాంట్రాక్టు కార్మిక చట్టం మొదలయినవి. వీటిని అనుసరించి కార్మికులను యజమానులు తమ ఇష్టానికి తొలగించవచ్చు. సంఘాలు పెట్టుకోవడం చాలా కష్టం. సంఘటితంగా బేరసారాలు చేయడం కష్టం, సమ్మెకు వెళ్లడం కష్టమే. బిజెపి అధికారంలో ఉన్న అనేక రాష్ట్రాలలో, కాంగ్రెస్ అధికారంలో ఉన్న రాష్ట్రాలలో కూడా రాష్ట్ర ప్రభుత్వాలు వీటిని అనుసరించాయి. కేంద్రంలో ఉన్న బిజెపి ప్రభుత్వం రాష్ట్ర ప్రభుత్వాలకు రాజస్థాన్ ప్రభుత్వం చేసిన కార్మిక చట్టాలను అనుసరించమని ఆదేశాలను జారీ చేసింది..

**9. కార్మిక శాఖ:** కార్మిక చట్టాలను నీరుగార్చడంతోపాటు ఆ చట్టాలను అమలుచేసే వ్యవస్థను– కార్మిక శాఖ , కార్మిక కోర్టులు – కూడా యజమానులపై పర్యవేక్షణ లేకుండా ఉండడానికి తుంగలో తొక్కబడుతున్నాయి. పర్యవేక్షణ ఇప్పుడు డిజిటలైజేషన్ ద్వారా అక్కడక్కడా జరుగుతున్నది. కార్మిక వర్గం, వారిసంఘాలు వారి జీవనంపై జీవితాలపై జరుగుతున్న ఈ దాడులను తిప్పికొడుతున్నారు. బిజెపి ప్రభుతం అధికారంలోకి వచ్చిన తరువాత 2015, 2016 లలో భారతదేశ వ్యాప్తంగా ఉమ్మడి కార్మిక సంఘాల ఉద్యమం ఆధ్వర్యంలో రెండు అతి పెద్ద కార్మిక సమ్మెలు జరిగాయి . 2017 లో ఎన్నడూ లేనివిధంగా మూడు రోజులపాటు "మహా పడావ్" నిర్వహించడం జరిగింది. వీటికి తోడుగా రంగాల వారి పోరాటాలు కూడా జరిగాయి – కోల్, స్టీల్, తోటలు, నిర్మాణం, రవాణా, పోర్ట్ అండ్ డాక్, టెలికం, బ్యాంక్స్, ప్రభుత్వ ఉద్యోగులు, వస్త్ర పరిశ్రమ, స్కీం వర్కర్స్, మొదలైనవి కొన్ని. ఈ పోరాటాలు కొంతమేరకు ప్రభుత్వం వేగంగా అమలు చేయాలనుకుంటున్న కార్మిక సంస్కరణల వేగాన్ని తగ్గించగలగవచ్చు. కార్మికులలో అసంతృప్తి కోపం పెరుగుతుండడంతో రాబోయే రోజులలో దేశం మోడీ ప్రభుత్వానికి వ్యతిరేకంగా మరిన్ని పారిశ్రామిక నిరసన ప్రదర్శనలు చవి చూడవలసిరావచ్చు. మొదటి అడుగుగా ప్రభుత్వ విధానాలు మార్చడానికి రైతులు, కార్మికులు సెప్టెంబర్ 5 వతేదీ ఒక చారిత్రాత్మక ర్యాలీ నిర్వహించ తలపెట్టారు. ఈ ప్రయత్నాలకు మరింతగా మద్దత్తు ఇవ్వవలసిన అవసరం ఉంది.

❖

# మనుస్మృతే బిజెపి రాజ్యాంగం

**బి**జెపి భారత రాజ్యాంగాని కన్నా మనుస్మృతికే ఎక్కువగా కట్టుబడి ఉందన్న విషయం దళితుల పట్ల అది అనుసరిస్తున్న విధానాలలో ప్రతిబింబిస్తుంది. ఆర్‌ఎస్‌ఎస్ దేశ వ్యాప్తంగా హిందువుల ఐక్యతను సాధించాలన్న దాని లక్ష్యానికి విరుద్ధంగా ఉందని అనిపించవచ్చు. కానీ ఈ ఐక్యత వర్ణాశ్రమధర్మం చట్రంలోనే జరగాలి అని అది కోరుకుంటున్నట్టు మోడీ ప్రభుత్వ నాలుగేళ్ళ పాలన రుజువు చేస్తోంది. రాజ్యాంగంలోని, చట్టాలలో దళితులకు సమాన హక్కులు, అస్పృస్యతకు సంబంధిచిన అంశాలను నీరుగార్చడం, తొలగించడం వంటి ఎన్నో చర్యలను చూస్తే ఈ విషయం స్పష్టమవుతోంది. దళితుల జీవనంపై, వ్యక్తిత్వంపై, వారి ఆత్మగౌరవంపై, విద్యపై, ఉద్యోగాలపై దాడులు జరుగుతున్నాయి.

## విద్య

మోడీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి సంవత్సరం కూడా కాక మునుపే మోడీ "ఆకాంక్షల భారతదేశాన్ని" నిర్మించాల్సిన అవసరం ఉందని సెలవిచ్చారు. కానీ దళితుల ఆకాంక్షలను అతికిరాతకంగా అవహేళన చేశారు. 2015 జనవరిలో హైదరాబాద్ కేంద్ర విశ్వవిద్యాలయంలో ఒక తెలివైన విద్యార్థి అయిన రోహిత్ వేముల హత్యే అందుకు సాక్ష్యం. సంఘ్ పరివార్ మౌలిక నమ్మకాలను తీవ్రంగా వ్యతిరేకించినందువల్లనే రోహిత్‌ను లక్ష్యంగా చేసుకుని వారు వేధించారు. అతను దళితుడు కాదని ఇతర వెనుకబడిన కులానికి చెందిన వాడని ప్రకటించి ప్రభుత్వం, అతను చనిపోయిన తరువాత అతని కులం గుర్తింపు కూడా అతనికి దక్క కుండా చేసింది.

2014 ఎన్నికల మేనిఫెస్టోలో బిజెపి దళితులకు, గిరిజనులకు, ఇతర వెనుకబడిన కులాలకు విద్యలో ప్రాముఖ్యత నిస్తానని వాగ్దానం చేసింది. వీరందరిని

పేదరికం నుంచి ముక్తులను చేసి సంస్థలకు అధిపతులను చేస్తానని నమ్మబలికింది. అయితే కేంద్ర ప్రభుత్వం అందుకు పూర్తిగా భిన్నమైన వైఖరి తీసుకుంది. ఎస్‌సి సబ్‌ప్లాన్‌లో భారీగా కోతలు విధించింది. దాదాపు పూర్తిగా రద్దుచేసింది.

2014–15 బడ్జెట్‌లో ఎస్‌సి సబ్‌ప్లాన్‌కు బడ్జట్‌లో 16.6% నిధులు అవసరం కాగా కేవలం 8.79% నిధులను కేటాయించింది. 2015–16లో 7.06%, 2016–17లో 8.91% 2018–19లో 6.55% నిధులు కేటాయించింది. 2014 నుండి 2018 లోపు సరాసరి కేటాయింపులు 7.59% మాత్రమే–అంటే ప్రభుత్వం పెట్టుకున్న లక్ష్యం, 16.6%లో సగం మాత్రవే. అంటే కోత పెట్టింది వేల కోట్ల రూపాయలన్నమాట. విద్యా సంస్థలలో దళితులకివ్వవలసిన స్కాలర్‌షిప్‌లు మంజూరు చేయక పోవడం వల్ల అనేక మంది దళితులు చదువులు మానేయాల్సిన పరిస్థితి ఏర్పడింది. దానికి తోడు సంస్థ నిర్వహించే అంతర్గత పరీక్షలలో వీరిని "తప్పిస్తు" న్నారు. ఉదాహరణకు 2017–18లో రూ. 8వేల కోట్ల స్కాలర్‌షిప్‌లు బకాయిలు ఉండగా కేంద్ర ప్రభుత్వం తన బడ్జెట్‌లో రూ.3347 కోట్లు కేటాయించింది. 2018–19 (విద్యార్థుల సంఖ్య పెరిగినా) ఈ మొత్తాన్ని రూ. 3వేల కోట్లకు కుదించింది. 2018 ఫిబ్రవరి 2, సామాజిక న్యాయం, సాధికార మంత్రి పార్లమెంటుకు "ఎస్‌సి విద్యార్థులకు రూ. 6824.5 కోట్లు స్కాలర్‌షిప్ బకాయిలు ఉన్నట్టు తెలియచేస్తారు. తమిళనాడు, ఉత్తరప్రదేశ్, మహారాష్ట్ర ప్రభుత్వాలు ఒక్కొక్కటీ రూ. 1400 కోట్ల బకాయిలు ఉన్నాయి. దీనిని బట్టి ఎంతెంతమంది దళిత విద్యార్థులు చదువులకు దూరమవుతున్నారో సులువుగా అర్థం చేసుకోవచ్చు.

దళితులకు ప్రభుత్వ విశ్వవిద్యాలయాలలో కళాశాలలో ప్రవేశం లేకుండా చేయడానికి కొత్తకొత్త విధానాలు అవలంభించబడుతున్నాయి. ఉదాహరణకు యూజిసి నియామకాలకు ఇచ్చిన కొత్త మార్గదర్శకాలు విశ్వవిద్యాలయాలలోని విభాగాలలో వారి సంఖ్య గణనీయంగా తగ్గించివేస్తుంది. ఇప్పటికే వారి సంఖ్య మొత్తంలో 7.22% మాత్రమే ఉంది. ఈ కొత్త విధానంతో ఒక్క బెనారస్ హిందూ విశ్వవిద్యాలయంలోనే అధ్యాపకులలో దళితులు 59% తగ్గే అవకాశం ఉంది.

**ఉద్యోగాలు**

విద్యా సంస్థలలోని ప్రభుత్వ ప్రైవేటు రంగాలలోనూ దళితులకు ఉద్యోగాలు రాకుండా చేయడానికి ఈ ప్రభుత్వం చేయగలిగిందంతా చేసింది. నిరంతరంగా సాగుతున్న ప్రైవేటు పరం చేసే ప్రక్రియ రిజర్వేషన్ అన్న పదానికి అర్థం లేకుండా చేసింది . ప్రభుత్వం ప్రైవేటు సంస్థలలో రేజర్వేషన్లకు చట్టం చేయడం మాట అటుంచి కనీసం చర్చించడానికి కూడా సంసిద్ధంగా లేదు. మరోవైపు ప్రభుత్వ, ప్రభుత్వ రంగ

సంస్థలలో రిజర్వేషన్ కోటాలోని ఉద్యోగాల ఖాళీలు పేరుకుపోతూనే ఉన్నాయి.

అదే సమయంలో సాంప్రదాయకంగా వస్తున్న ఆదాయ మార్గాలు మూసుకు పోతున్నాయి. "గో రక్షకుల" పేరుతో దళితుల సాంప్రదాయక పనులకు అడ్డు పడుతున్నారు. వారి పశు విక్రయాలు, వైద్య శాలలు మూతపడుతున్నాయి. తోలు, తోళ్ల పరిశ్రమలు మూతపడి, లక్షలాది దళితులు పనులు కోల్పోయారు. గొడ్డు మాంసం అమ్మడం నిషేధించడంతో దళిత కుటుంబాలకు చవకగా అందే పోషకాలు కూడా అందకుండా పోయాయి. 54% దళితులు పోషకాహార లోపంతో బాధపడుతూ, ప్రతి వెయ్యి మంది దళితులలో 84 మంది తమ శిశువులను కోల్పోతున్న ఈ దశలో ఇది అత్యంత కీలకమైన అంశం. ఈ గో రక్షణ అన్నది పాశవికం. 2016 జులై 11న ఉనాలో చనిపోయిన గొడ్డు చర్మం వలవమని 5 గురు దళితులను హింసించి, అవమానించిన విషయం దళితులపై జరుగుతున్న దాడులను తెలియజేస్తుంది. ఇక దళితులను పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దుతామన్న ప్రభుత్వ మాటలలోని బూటకాన్ని, దళితులకు పారిశ్రామిక వేత్తలుగా తీర్చి దిద్దేందుకు ఎస్‌టి, ఎస్‌సి హబ్ నిర్మించడం పేరుతో బహుళజాతి సంస్థలకు వేల కోట్ల రూపాయలు కట్టబెట్టడంతో, ప్రభుత్వ చిత్తశుద్ధిలోని డొల్లతనాన్ని ప్రొఫెసర్ సుఖ్‌దేవ్ టాండన్ బహిర్గతం చేశారు. ఈ హబ్‌కు అసలు కేటాయింపులు రూ. 490 కోట్లు. ఎంఎస్‌ఎం ఈ సేకరణ విధానంలో మంత్రిత్వ శాఖ ఎస్‌సి, ఎస్‌టిలు నడుపుతున్న సంస్థల నుండి 4% కొనుగోళ్లు చేయాల్సి ఉంది. అంటే రూ. 59.7 లక్షలు. కానీ వీరు అసలు కొనుగోళ్లు చేసింది నామ మాత్రంగా 0.39% మాత్రమే.

**భూమి**

దళితులు చారిత్రికంగానే భూమిపై హక్కుకు తిరస్కరించబడ్డారు. దూరం చేయబడ్డారు. ఇది ఈ నాటికీ అత్యధికంగా దళితులు, 58% మంది, భూమి లేకుండా ఉండడంలో ప్రతిబింబిస్తుంది. అయినా మోడీ ప్రభుతం దళితుల భూ సమస్యను పట్టించుకోలేదు. దళితులకు భూమినిచ్చే ఒక్క కార్యక్రమమూ మోడీ నాలుగేళ్ళ పాలనలో ఒక్క బిజెపి పాలిత రాష్ట్రంలో గాని కేంద్రంలో గాని చేపట్టలేదు.

**దళితులపై అత్యాచారాలు, అత్యాచార నిరోధక చట్టం**

2017 నవంబర్‌లో ప్రకటించిన ఎంసిఆర్ గణాంకాల ప్రకారం 2016లో 2015లో కన్నా 5.5% ఎక్కువ అత్యాచారాలు జరిగాయి. 2016లో మొత్తం దళితులపై జరిగిన అత్యాచారాలు 40,801 నమోదు కాగా 2015లో 38,670 కేసులు నమోదు అయ్యాయి. ఇందులో అత్యధిక కేసులు బిజెపి పాలిత రాష్ట్రాల్లోనివే. అత్యధికంగా ఉత్తరప్రదేశ్ లో నమోదయ్యాయి. ఇక్కడ 2016లో నమోదయినవి 10426

సంఘటనలు. అంటే మొత్తం నమోదైన వాటిలో 25.6% అన్నమాట. ఆ తరువాత స్థానం బిహార్‌ది. ఇక్కడ 14%. రాజస్థాన్‌లో 12.6% నమోదయ్యాయి. దళితులకు వ్యతిరేకంగా నేరాలు మధ్యప్రదేశ్‌లో 43.4%, రాజస్థాన్‌లో 42%, గోవాలో 36.7% బీహార్‌లో 34.4%, గుజరాత్‌లో 32.5% నమోదయ్యాయి. భారతదేశంలో దళితులకు వ్యతిరేకంగా జరిగిన నేరాలు క్రితం సంవత్సరం సరాసరి 20.6%గా ఉన్నాయి. అయితే శిక్షలు పడ్డవి మాత్రం నమోదైన కేసులలో 1% మాత్రమే ఉన్నాయి . సగానికి సగం కోర్టులలో ఏళ్ల తరబడి మూలుగుతున్నాయి .

ఈ పరిస్థితులలో సుప్రీంకోర్టు అత్యంత తిరోగమన తీర్పునిచ్చి అత్యాచార నిరోధక చట్టంలోని నిబంధనలను నీరుగార్చింది. కేంద్ర ప్రభుత్వం దళితులకు అనుకూలంగా వాదనలు వినిపించకపోవడం వల్ల ఇది సాధ్యపడింది. 2018 ఏప్రిల్‌లో దేశ వ్యాప్తంగా నిరసన ప్రదర్శనలు జరగడం, బందు స్వచ్ఛందంగా పాటించడం, వీటిలో యువ దళితులు అధికంగా పాల్గొనడంతో బిజెపి ప్రభుత్వం సాయుధ బలప్రయోగంతో ఈ నిరసనలను అణచివేసింది. బిజెపి పాలిత రాష్ట్రాలలో పోలీస్, ఉన్నత తరగతుల కాల్పులలో 9 మంది దళితులు ప్రాణాలు కోల్పోయారు. నిరసనలు తెలియజేస్తున్న మధ్యప్రదేశ్ లోనే నలుగురిని బిజెపి గుండాలు పొట్టన పెట్టుకున్నారు.

❖

# గిరిజనుల వికాసం శూన్యం

**“అ**చ్ఛే దిన్” అని “సబ్ కా సాథ్ సబ్ కా వికాస్” అని నినాదాలు ఇస్తున్నా ఆచరణలో మాత్రం ఆదివాసీ తెగలు మోడీ నాలుగేళ్ళ దుష్పరిపాలనలో తీవ్రమైయిన దాడులను ఎదుర్కొన్నారు. ప్రభుత్వం ఒకవైపు బడా వ్యాపారులకు మరిన్ని ప్రయోజనాలను సమకూరుస్తూ గిరిజనులకు చేయవలసిన కేటాయింపులలో కోతలు పెడుతోంది. అంతేకాదు ఇప్పుడున్న అనేక చట్టాలను నీరుగార్చింది. వాటినుండి పొందవలసిన ప్రయోజనాలనూ గిరిజనులకు అందకుండా చేసింది. ఉదాహరణకు అటవీ హక్కులు, పంచాయత్ చట్టం (షెడ్యూల్ ప్రాంతాలకు పొడిగించింది)(పిఇఎస్ఏ), గిరిజన సబ్ ప్లాన్ నిధులకు కోత పెట్టి గతంలో ఎన్నడూ లేనంత తక్కువస్థాయిలో కేటాయింపులు చేసింది. గ్రామీణ గిరిజనులలో 45%, పట్టణ ప్రాంతాల్లోని గిరిజనులలో 24% నిరుపేదలుగా ఉన్నారన్న విషయం ఇక్కడ గమనించాలి. అందువలన వారికి ప్రభుత్వనిధుల సహాయం అవసరం ఉంది.

బిజెపి గిరిజనులకు గిరిజనేతరులకు ఉన్న అభివృద్ధిలో తేడాను సరిచేస్తానని వాగ్దానం చేసింది. ఇందుకోసం సమాన అవకాశాలు ఉండే వ్యవస్థను ఏర్పరుస్తానని, తద్వారా రాజ్యాంగంలో పొందుపరచిన ఆర్థిక, రాజకీయ సాధికారికత మరింతగా పొందే అవకాశం ఉంటుందని చెప్పింది. కానీ నాలుగేళ్లుగా గిరిజనుల అనుభవం అందుకు భిన్నంగా ఉంది. వారికున్న అధికారాలు కూడా కోల్పోతుండగా, కల్పించిన భ్రమల తెరలు తొలగిపోతూ వారి పరిస్థితి ఎంతో నిరాశా జనకంగా ఉంది. 2015 లో ప్రధాన మంత్రి చైర్మనుగా నేషనల్ ట్రైబల్ అడ్వైజరీ కౌన్సిల్‌ను ఏర్పరిచారు. ఇది పూర్తిగా రాజ్యాంగ విరుద్ధం. ఇది ఇప్పుడున్న ట్రైబల్ అడ్వైజరీ కౌన్సిల్ రాజ్యాంగ బద్ధతను బలహీన పరుస్తోంది. అలాగే నేషనల్ ట్రైబల్‌డెవలప్‌మెంట్ పాలసీ (జాతీయ గిరిజన అభివృద్ధి విధానం) గురించి ప్రజలలో ప్రచారం అయితే చేస్తున్నారుగాని దాని అమలుకు సంబంధించి ఏ రకమైన చర్చలు గాని, ప్రవేశపెట్టే ప్రయత్నాలు గాని జరగలేదు.

**వ్యాపారం సులభతరం :** అడవులు, భూములు, నిర్వాసితుల పరిస్థితిని గురించి కిందటేడాది నరేంద్రమోడీ ఒక ప్రతిష్టాత్మకమైన ప్రకటన చేశారు. అడవి హక్కుల చట్టం పరిధిలో వ్యక్తులు గాని, సమూహాలుగాని తామే హక్కుదారులమని ముందుకువచ్చిన వారి విషయం రెండు నెలల్లో తేల్చేస్తామని. వాస్తవానికి 20% నుంచి 25% వరకు సమస్యలను మాత్రమే పరిష్కరించగలిగారు. అటవీ హక్కుల కింద హక్కుదారులమన్న 50% దరఖాస్తులు నిరాకరించబడ్డాయి. అటవీ హక్కుల చట్టం 2006 లో తయారుచేయబడింది. సాంప్రదాయకంగా అడవులలో ఉంటున్న గిరిజనుల హక్కులను, ఇదివరకటి వలసవాదులు నిరాకరించిన నేపథ్యంలో గిరిజనుల హక్కులను తిరిగి వారికి కట్టపెట్టడమే ఈ చట్టం యొక్క ముఖ్య ఉద్దేశం. అయితే 2008 లో, దీని నోటిఫికేషన్ ఇచ్చిన నాటి నుండి, వచ్చిన ప్రతి ప్రభుత్వమూ అడవులలో ఉన్న అపారమైన సంపదను ప్రభుత్వాలు, ప్రైవేటు వ్యక్తులు కట్టే ప్రాజెక్టులకు అప్పచెప్పడానికి ఈ చట్టం అడ్డని భావించడం జరుగుతోంది. చట్టంలోని లొసుగులను అడ్డంపెట్టుకుని ఆదివాసీజాతుల సాంప్రదాయ హక్కులను కాలరాయడం జరుగుతోంది. ఒరిస్సా, ఛత్తీస్‌ఘర్, ఝార్ఖండ్ ప్రభుత్వాలు చట్టంలోని అంశాలను నీరుగార్చి అటవీ భూములను గనుల తవ్వకానికి కట్టపెడుతోంది. ఈ పరిస్థితి బిజెపి పాలిట రాష్ట్రాలలో మరింత ఎక్కువగా ఉంది. ఛత్తీస్‌ఘర్ లో 12 గ్రామాలలో ఇనప ఖనిజం తవ్వకాల ప్రతిపాదన ఉన్నందువల్ల అక్కడ అటవీ హక్కులను ప్రభుత్వం గుర్తించ నిరాకరించింది. ఛత్తీస్‌ఘర్ లోని సర్గుజా జిల్లాలో ప్రభుత్వం కమ్యూనిటీ ఫారెస్ట్ రైట్స్ (జాతుల అటవీ హక్కులు) ను పూర్తిగా నిరాకరిస్తోంది. కారణం అక్కడ మోడీ ఆశ్రితుడు, అదానీ, ఒక గనిని ప్రారంభించాలని అనుకుంటున్నారు. ఇలాగే అడవులలో గనుల తవ్వకాలకు ఉపయోగ పడతాయన్న చోటల్లా సిఆర్ఎఫ్‌ల హక్కులు కాలరాయ బడుతున్నాయి. చట్టపరంగా అటవీ భూములను ఇతర పనులకు ఉపయోగించాలంటే గ్రామ సభల అనుమతి కావాలి. కానీ ఆచరణలో ప్రభుత్వాలు అటవీ భూములను ఇతర అవసరాలకు ఉపాయోగించుకోవాలనుకున్నప్పుడు గ్రామసభల పాత్రను నాశనం చేస్తున్నాయి. ఉదాహరణకు జార్ఖండ్‌లోని లతేహార్ట్ జిల్లాలో బొగ్గుగని తవ్వకానికి నకిలీ గ్రామసభ అంగీకారం తెలిసింది. 2015లో కేంద్రం 35867 ఎకరాల అటవీ భూములను మౌలిక వసతుల అభివృద్ధికి అనుమతిచ్చింది. దాదాపు 5 లక్షల ఎకరాల అటవీ భూమికి గ్రామ సభల అంగీకారం లేకుండానే కేంద్రం అనుమతులను ఇచ్చింది. పార్లమెంటరీ కమిటీ అనుమతులు నిరాకరించిన తరువాత ఆపుచేసిన ప్రాజెక్టులకు టిఆర్ఎస్ సుబ్రహ్మణ్యం కమిటీ వేగవంతంగా అనుమతులు మంజూరు చేస్తోంది. ఇవి లక్షలాది ఆదివాసీలను నిర్వాసితులను చేయబోతున్నాయి. అటవీ భూమిని ఇతర అవసరాలకు వినియోగించదలుచుకుంటే గ్రామాసభల అనుమతి కావలసి ఉంటుందని మోడీ

స్వయంగా ఏర్పరచిన ట్రైబల్ అఫైర్స్ మినిస్ట్రీ నొక్కి చెప్పిన తరువాత పరిస్థితి ఇది.

**పక్షపాతమైన చట్టాలు**

గిరిజనులు ఉపయోగించుకుంటున్న అడవికి, భూమికి సంబంధించిన అనేక చట్టాల స్థానంలో అన్యాయమైన, దోపిడీకి ఉపయోగపడే చట్టాలను ప్రవేశ పెట్టారు. ఇందుకు కారణం కార్పొరేట్లకు గనుల తవ్వకానికి ఈ భూములు ఇవ్వాలనుకోవడమే.

❖ 2016 ఆగస్టు లో ది కంపెన్‌సీటోరీ ఆఫ్రేష్టషన్ ఫండ్ యాక్ట్ (అడవులను నరికినందుకు పరిహార నిధి చట్టం) అమలులోకి వచ్చింది. ఈ చట్టం ద్వారా అడవులను నరికినా పరిహార నిధి యాజమాన్యం, తిరిగి చెట్లు నాటే అధికారం (సిఏఎంపిఏ) గల సంస్థలు కేంద్రంలోను, రాష్ట్రాలలోను ఉంటాయి. అవి అటవీ భూములను ఇతర ప్రయోజనాలకు ఉపయోగించుకున్నపుడు వసూలు చేసిన నిధులను తిరిగి అడవుల పెంపకానికి వేగవంతంగాను, పారదర్శకంగాను ఉపయోగించుకునేటట్టు చూడాలి. కానీ ఇలా అడవులను ఇతర ప్రయోజనాలకు ఉపయోగించుకున్నందువల్ల వసూలు చేసిన నిధులు ఖర్చవ్వకుండానే ఉంటున్నాయి. ముఖ్యమైన విషయం ఏంటంటే ఇంతకీ నరికేసిన అడవుల స్థానంలో కొత్తగా అడవులను పెంచేందుకు భూమి ఎక్కడి నుండి వస్తుంది? అంటే కంపాబిల్, ఆచరణలో గ్రామ సభలకు ఏ విధమైన హక్కులూ లేకపోవడం వల్ల గిరిజన హక్కులకు, వారికి అడవిలోని వనరుల మీద ఉన్న హక్కులతో సహా నష్టం కలిగిస్తుంది. అందుకు బదులుగా ఆ హక్కులు అటవీశాఖకు బదిలీ అవుతాయి. వారు కొంతమంది అధికారులకు ఆ పనులను అప్పగిస్తారు. అటవీ శాఖకు, గ్రామసభలకు ఎప్పుడూ ఉండే భేదాభిప్రాయాలు పరిగణనలోనికి తీసుకుంటే భవిష్యత్ మనకు సులభంగానే అర్థం అవుతుంది.

❖ ఆదివాసీలకు ప్రాణగండం గనులు ఖనిజాల (నియంత్రణ, అభివృద్ధి) చట్టం. ఇందులో రాయల్టీగా వచ్చిన నిధులను 100% గిరిజనుల అభివృద్ధికి ఉపయోగించాలనే నిబంధన పూర్తిగా విస్మరించబడింది. కొత్త చట్టం ప్రకారం వచ్చిన సొమ్ములో 30% మాత్రం ఈ నిధిలో పెడితే సరిపోతుంది.

❖ ఇప్పుడున్న భూసేకరణ చట్టాన్ని నీరుగార్చడంలో విఫలమైన తరువాత బిజెపి ప్రభుత్వం రాష్ట్ర ప్రభుత్వాల ద్వారా చట్టాన్ని నీరుగార్చే ప్రయత్నాలు చేస్తోంది. ఝార్ఖండ్‌లోని బిజెపి ప్రభుత్వం సంథాల్ పరిగణ కౌలు, చోటనగర్ కౌలు చట్టాలను తెచ్చింది. ఈ చట్టాలు గిరిజనుల భూమిని కార్పొరేట్‌లకు బదలాయించేందుకు ఉన్న అన్ని రక్షణలనూ తొలగించివేస్తోంది. ఆంధ్రప్రదేశ్‌లో టిడిపి –బిజెపి సంకీర్ణ ప్రభుత్వం పోలవరం బహుళార్థక

ప్రయోజన ప్రాజెక్ట్‌కు అవసరమైన గిరిజన భూమిని బలవంతంగా లాక్కుని 80 వేల మంది గిరిజనుల జీవితాలను సర్వనాశనం చేసింది.

❖ ఇవి కాక చిన్నవైనా గిరిజనుల ప్రయోజనాలకు భంగం కలిగించే ప్రముఖమైన చట్టాలు మరికొన్ని ఉన్నాయి. ఇందులో పర్యావరణ, అటవీ క్లియరెన్స్ పనులను రహదారుల నిర్మాణంలోగాని, జాతీయ పార్కులకు, అభయారణ్యాలకు మధ్యతరగతి పరిశ్రమలు స్థాపించడానికి ఉండాల్సిన దూరాన్ని 10 కిలోమీటర్లలోపుకు బదులుగా 5 కిలోమీటర్లను మార్చడం లోగాని, ఒక విభాగానితో ఇంకోదానికి సంబంధం లేకుండా చేయడం. నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్ ని ఒక పరిపాలన విభాగం స్థాయికి దిగజార్చడం, కొన్ని రకాల బొగ్గు గనులకు ప్రజా ఫిర్యాదులు వినవలసిన అవసరాన్ని రద్దు చేయడం వగైరా ఉన్నాయి.

## గిరిజన సబ్‌ప్లాన్‌లో లోతైన కోత

మోడీ ప్రభుత్వం గిరిజన సబ్‌ప్లాన్‌లోగాని ఎస్‌సి సబ్‌ప్లాన్‌లో గాని తీవ్రమైన కోతలు పెడుతోంది. ప్రణాళిక, ప్రణాళికేతర వ్యయాల మధ్య అంతరాన్ని తొలగించింది. కేవలం గిరిజన అభివృద్ధి కిందే నిధులను కేటాయిస్తోంది. కేటాయింపులు తక్కువ కావడంతో గిరిజనులకు హక్కులున్న వనరులు కుంచించుకు పోతున్నాయి. గిరిజన సబ్‌ప్లాన్ కింద బడ్జెట్‌లో 8.6% కేటాయించవలసి ఉండగా మోడీ ప్రభుత్వం కేంద్ర పథకాలకు, కేంద్రం మద్దతు ఉన్న పథకాలకు కలిపి బడ్జెట్‌లో ప్రత్యక్ష ప్రయోజనాలు చేకూర్చేందుకు గాని ఆదివాసీల అభివృద్ధికి గాని కలిపి అందులో సగం కూడా ఈ నాలుగేళ్లుగా కేటాయింపులు చేయడం లేదు. ఇందువలన గిరిజనులకు మొత్తం రూ.1.14 లక్షల కోట్ల నష్టం వచ్చింది. ఇదే కాలంలో బడ్జెట్‌లో ఇచ్చిన రాబడి కోల్పోయిన సమాచారం మేరకే రూ. 15 లక్షల కోట్ల రాయితీలు కార్పొరేట్లకు, ధనికులకు ఇవ్వడం జరిగింది.

| గిరిజన సబ్‌ప్లాన్ కోతలు | షెడ్యూల్డ్ కులాల సబ్‌ప్లాన్‌లో గిరిజన సబ్‌ప్లాన్ వాటా |
|---|---|
| 2014-15 | 5.63% |
| 2015-16 | 4.30% |
| 2016-17 | 4.30% |
| 2017-18 | 5.43% |
| 2018-19 | 4.53% |
| 5 ఏళ్ళ సరాసరి | 6.77% |

## నైపుణ్యం పెంపొందించడం, వృత్తి నైపుణ్యం

గిరిజనుల ఆర్థికాభివృద్ధి వారికి అవసరమైన నైపుణ్యాలను, వృత్తి నైపుణ్యాలను పెంపొందించడంలోనే ఉంది. కానీ మోడీ ప్రభుత్వం ఈ నాలుగేళ్ళ కాలంలో ఈ నిధుల కేటాయింపులను సగానికి సగం తగ్గించింది.

| నైపుణ్యం అభివృద్ధి సం. | నైపుణ్యం అభివృద్ధికి, వృత్తివిద్యకి కేటాయింపులు (లక్షల్లో ) |
|---|---|
| 2014-15 | 37296 |
| 2015-16 | 27946 |
| 2016-17 | 20229 |
| 2017-18 | 16458 |

## హిందుత్వ ప్రచారం

ఆదివాసీ జాతులకు నిధులు వనరులు అందుబాటులో లేకుండా చేయడమే కాక వారిని 'హిందూ' మత చట్రంలోకి తెచ్చే ప్రయత్నాన్ని, సంఘపరివార్ నిరవధికంగా కొనసాగిస్తూనే ఉంది. ఆదివాసీలకు, క్రిస్టియన్లకు మధ్య విబేధాలు సృష్టిస్తోంది. ఘర్ వాపసీ(తిరిగి సొంతగూటికి), ప్రచారాలు చేయడం, మత మార్పిడులు చట్టవిరుద్ధం చేయడం వంటివి జరుగుతున్నాయి. ఆవులను రక్షించడం పేరుతో, ఆదివాసీలలో అత్యంత సాధారణమైన గొడ్డు మాసం తినడాన్ని లక్ష్యంగా చేసుకుని దాడులు చేస్తున్నారు. ప్రజల ఆహారపు అలవాట్లపై దాడులు చేయడం, కొన్ని జాతులకు పోషకాహారాన్ని సమకూర్చి పెట్టే ఆహారం వారికి అందకుండా చేయడం, ఒకరిపై ఒకరికి ద్వేషం కలిగించడం నిరంతరంగా జరుగుతూనే వుంది.

## మావోయిస్టులకు వ్యతిరేకంగా అనే పేరుమీద అణచివేత

ఛత్తీస్‌ఘర్, మహారాష్ట్ర, ఝార్ఖండ్, ఇతర రాష్ట్రాల్లో మావోయిస్టులను / నక్సలైట్లను అణచివేయడం అన్న పేరుమీద కార్యాచరణలు చేపడుతున్నారు. మావోయిస్టులు ఉన్నారన్న నెపంతో రక్షణ శక్తులు ఆదివాసీ జాతులపై అత్యాచారాలు, దౌర్జన్యాలు, హత్యలు చేస్తున్నారు. మావోయిస్టులను వెతకడం పేరుతో స్థానికులతో పాశవికంగా ప్రవర్తించి భయ భ్రాంతులను చేస్తున్నారు. రక్షణ అన్న పేరుమీద గిరిజన మహిళలపై అత్యాచారం చేసిన వార్తలను ప్రచారంలోకి రానీయడం లేదు.

మొత్తానికి చూసుకుంటే మోడీ అతని సంఘ్ పరివారం ఆదివాసీల స్నేహితులం, మంచి కోరేవారం అని చెప్పుకుంటున్నా వారి పనులు గిరిజనుల పై వారికున్న ద్వేషాన్ని స్పష్టంగా చూపిస్తున్నాయి. గిరిజన జాతులకు "వికాసం" అన్నిది బొక్క బోర్లా పడింది. ఇప్పుడు మనకు అర్థమవుతున్నదేమంటే, కేవలం ఓట్ల కోసం వారు అబద్ధ ప్రచారాన్ని చేశారు అని.

❖

# మహిళలు : భద్రత లేదు, ఆర్థిక రక్షణ అసలే కరువు

మోడీ అధికారానికి వచ్చి నాలుగేళ్ళు అయింది. ఆయన రకరకాల వాగ్దానాలు చేసి ప్రధానమంత్రి అధికార పీఠాన్ని ఎక్కారు. బహుశా ఆ వాగ్దానాలన్నీ బిజెపి ఆఫీస్ పునాదులలోనే ఇరుక్కుపోయి ఉంటాయి. ఆ మరిచిపోయిన వాగ్దానాలతో మహిళలకు చేసినవి కూడా కొన్ని ఉన్నాయి. 2014లోని సాధారణ ఎన్నికల మేనిఫెస్టోలో "మహిళలు : దేశ నిర్మాతలు". అని మోడీ అట్టహాసంగా చెప్పుకున్నారు. అందులో బిజెపి, మహిళలు దేశ, సమాజ అభివృద్ధిలో ఎంతటి కీలక పాత్ర నిర్వహిస్తారో బిజెపి కి అవగాహన ఉందని పేర్కొంది. బిజెపి మహిళా సాధికారికతకు కట్టుబడి ఉందని మహిళల ఆరోగ్యం మెరుగుపడడానికి, విద్యకు కట్టుబడి ఉందని చెప్పుకున్నారు. మహిళలకు 33% రిజర్వేషన్ అమలు చేసి తీరుతామని చెప్పారు. కానీ గడచిన నాలుగేళ్లలో మోడీ మేనిఫెస్టోలోని వాగ్దానాల అమలుకు ఏ చర్యలూ తీసుకోలేదు. సరికదా మహిళల పరిస్థితి నానాటికి దిగజార్చారు.

## మహిళల రేజర్వేషన్లు

2014 మేనిఫెస్టో లో వారు "మహిళకు పార్లమెంటులో 33% రేజర్వేషన్లకు కట్టుబడి ఉన్నామని , రాష్ట్ర అసెంబ్లీలలో కూడా అవసరమైన సవరణలు చేసి అమలు చేస్తామని" చెప్పుకున్నారు. నాలుగేళ్లు గడిచాయి. కానీ ఈదిశగా ఏ రకమైన అడుగులూ పార్టీగాని, ప్రభుత్వం గాని ముందుకు వేయలేదు. పార్లమెంటులో 75 మంది మంత్రులకుగాను 9 మంది మాత్రమే మహిళలు ఉన్నారు. ఇదివరకు కూడా 33% రిజర్వేషన్‌కు అనేక సార్లు మద్దతు ప్రకటించారు కానీ ఆచరణకు ఎటువంటి ప్రయత్నమూ చేయలేదు. మిగిలిన ఏడాది కాలంలో నైనా బిజెపికి తగిన సంఖ్యా బలం ఉన్నందువల్ల, మహిళా రిజర్వేషన్ బిల్‌ను ప్రవేశ పెట్టి పాస్ చేయించుకోవాలి.

## మహిళలలో ఉద్యోగిత

ఉద్యోగిత అన్నది మహిళా సాధికారికత విషయంలో మరింత ముఖ్యమైన అంశం. కార్మిక శక్తిలో మహిళల భాగస్వామ్యం ఎప్పుడూ తక్కువగానే ఉంటుంది ఇప్పుడూ తక్కువగానే ఉంది. లేబర్ బ్యూరో నిర్వహించిన 5వ ఉద్యోగిత –నిరుద్యోగం సర్వేలో 2013–14లో 25.8%గా ఉన్న మహిళలో ఉద్యోగిత 2015–16కు 23.7% నికి పడిపోయింది. ఇది ప్రపంచంలోనే అతి తక్కువ మహిళా భాగస్వామ్యం. అదే సమయంలో మహిళలలో నిరుద్యోగం 7.7% నుండి 8.7%నికి పెరిగింది.

అంటే మోడీ ప్రభుత్వం 1990లలో ప్రారంభమైన మహిళలలో ఉద్యోగిత తగ్గడాన్ని వెనక్కు నెట్టలేకపోయింది. ఇది ఆశ్చర్యాన్ని కలిగించదు. ఎందుకంటే అసలు ఉద్యోగిత పెంచడానికే మోడీ పాలన ఏ చర్యలూ తీసుకోలేదు. మహిళల ఉద్యోగిత పెంచడానికి కూడా ప్రత్యేకమైన ఏ చర్యలూ తీసుకోలేదు. నిజానికి మోడీ మహిళలను 'వాలంటరీ' పనివారిగానే గుర్తించారు. వారికి ఉద్యోగ రక్షణలేదు. కనీస వేతనాలు లేవు. సామాజిక భద్రతా కూడా లేదు. ఒక కోటి మంది రక రకాల ప్రభుత్వ పథకాలను, ఐసిడిఎస్, ఎన్ఎహెచ్ఎం, మధ్యాహ్నం భోజన పథకం, మొదలయినవి అమలు చేసే వారు ఉన్నారు. అందులో అత్యధికులు మహిళలే. ఆరోగ్యం, విద్య, సంరక్షణ సేవలు అత్యవసరమైన వారికి, వివక్షతకు గురైన వారికి ఈ పథకాలు అందిస్తాయి. బిజెపి మేనిఫెస్టోలో మొదటి పూర్తి బడ్జెట్‌లోనే అంగన్వాడీల వేతనాలు పెంచుతామని స్పష్టంగా ఉన్నప్పటికీ మోడీ ప్రభుతం ఈ పథకంం కింద కేటాయించిన నిధులను 2014–15లోఉన్న రూ. 18,108 కోట్ల నుండి 2015–16కు రూ. 8400 కోట్లకు తగ్గించింది. 2017–18 లో కేటాయింపులు రూ. 16,334. కోట్లకు పెంచినా ఇది కూడా నాలుగేళ్ళ కిందటి కేటాయింపులకన్నా తక్కువే.

## పోషకాహారం

మహిళల ఆరోగ్యం పోషకాహారం విషయంలో మోడీ ప్రభుత్వ పని కనీస స్థాయిలో కూడా లేదు. 4వ జాతీయ కుటుంబ ఆరోగ్య సర్వే ప్రకారం 15–49 ఏళ్ల మహిళలలో 53.1%, గర్భిణీ స్రీలలో 50.3% మహిళలు రక్తహీనతతో బాధపడుతున్నారు. గర్భిణీ స్త్రీలలో కేవలం 21% మంది మాత్రమే అవసరమైన సంరక్షణ పొందుతున్నారు. నాలుగు సార్లు డాక్టర్లను సంప్రదించడం, ఒకసారి గుర్రపువాతం ఇంజక్షన్ చేయించుకోవడం, 100 రోజులు గాని ఆ పైన గాని, ఇనుము, ఫోలిక్ ఆసిడ్ మాత్రలు వాడడం వగైరా. జనని సురక్ష యోజన కింద 36.4% మంది మాత్రమే సహాయాన్ని పొందుతున్నారు. 2016 డిసెంబర్ 31 వ తేదీ గర్భిణీ స్త్రీలకు , పాలిచ్చే తల్లులకు ఒక స్కిం ని ప్రవేశ పెడుతున్నట్టు ప్రకటించారు.

అప్పటికి అదింకా ప్రణాళిక స్థాయిలోనే ఉంది. ఇది కూడా కేవలం అప్పటికే ఉన్న మాతృత్వ ప్రయోజనాల పథకాన్ని విస్తృత పరచడమే. పథకాన్ని విస్తృత పరుస్తూనే దాని పరిధిని కుదించారు. ఇది వరకు ఈ పథకం ప్రయోజనాలు మొదటి ఇద్దరు పిల్లలకు వర్తించేది. ఇప్పుడు క్యాబినెట్ దానిని ఒకరికే పరిమితం చేసింది. ఈ పథకాన్ని ఇప్పుడు ఆధార్‌కు అనుసంధానం చేశారు. అందు వల్ల మరింత మంది ఈ పథకం ప్రయోజనాల పరిధి నుండి తొలగిపోయే అవకాశం ఉంటుంది.

ఎన్ఎఫ్ఎచ్ఎస్ 4, 15–19 ఏళ్ళ మధ్య వయసులోని వారిలో 41.9% ఉండవలసిన బరువు కన్నా తక్కువగా ఉన్నట్టు గుర్తించింది. అంటే వారి ఆరోగ్యం అత్యంత అపాయకర పరిస్థితిలో ఉందన్నమాట. ఇందుకు కారణం సరైన పోషకాహార లోపం. కానీ ప్రభుత్వం ఈ తీవ్రమైన సమస్యను గురించి పట్టించుకునే పరిస్థితిలో లేదు. అంతేకాదు. ఈ పథకం నిధులలో కూడా కోత పెట్టింది.

### హింస

మోడీ పాలనా కాలంలో మహిళలపై హింస పెరిగింది. ఆశ్చర్యంగా, ఎన్‌సిఆర్‌బి గణాంకాలు శిక్షకు గురవుతున్న వారు తగ్గుతున్నారని సూచించింది. అంటే తప్పు చేసిన వారిని శిక్షించే ప్రయత్నం పరిపాలన విభాగాలు చేయడం లేదన్నమాట. 2013లో మోడీ అధికారంలోకి రాకముందు మహిళల పట్ల 337,922 నేరాలు నమోదయ్యాయి. అంటే జనాభాలో ప్రతి లక్షకి 52.2 మంది అన్నమాట. ఇది 2016కు 338594కు అంటే లక్షకి 55.2కు చేరింది. అత్యాచార కేసులు 2013లో ఉన్న 33707 నుండి 2016కు 38947కు చేరాయి. అయితే శిక్ష పడ్డ వాటి సంఖ్య 2013లో 21.3% నుండి 2016కు 18.9% నికి పడిపోయింది. నిజానికి బిజెపి 498 సెక్షన్‌లో నుండి భర్తలను, బంధువులను మినహాయించి, సవరించి దానిని కొంత నిర్వీర్యం చేసింది. దీనిని మనం అర్థం చేసుకోవచ్చు. ఎందుకంటే బిజెపి –ఆర్ఎస్ఎస్ సిద్ధాంతం ప్రకారం, వారి మంత్రులు, ఎన్నికైన ప్రతినిధుల ప్రకారం మహిళలు హింసకు గురికావడానికి కారణం మహిళలే గాని హింసించినవారు కారు. అనేక మంది బిజెపి నాయకులూ, మద్దతు దారులూ మహిళలు వేసుకోవలసిన డ్రెస్ కోడ్‌ను గురించి, వారు రాత్రులు బయటకు తిరగకుండా ఉండడాన్ని గురించి బహిరంగంగానే ప్రకటించారు. అది వారి దృక్పథాన్ని తెలియజేస్తుంది. అందువల్ల విచారణలు శిక్షలు వెనకపట్టు పట్టడం ఆశ్చర్యం కలిగించదు.

2016లోని అత్యధిక అత్యాచారాలు జరిగినవి మధ్యప్రదేశ్, ఉత్తర్ ప్రదేశ్, మహారాష్ట్రలలో. ఇవన్నీ బీజేపీ పాలిత రాష్ట్రాలే. ఈ మధ్యనే విడుదలైన రిపోర్ట్స్

ప్రకారం యోగి ఆదిత్యనాథ్ మొదటి పది నెలల కాలంలో ఉత్తర్‌ప్రదేశ్‌లో మహిళల పట్ల హింస మరింత ఉచ్ఛ స్థాయికి చేరింది .

### హిందుత్వ వాదుల దృష్టిలో మహిళలు

మహిళల పట్ల బిజెపి సైద్ధాంతిక అవగాహనను గనక పరిశీలిస్తే మహిళల పట్ల బిజెపి అనుసరిస్తున్న పక్షపాత వైఖరిని అర్థం చేసుకోగలుగుతాము. బిజెపి, ఆర్‌ఎస్‌ఎస్‌కి పుట్టింది. ఆర్‌ఎస్‌ఎస్ సిద్ధాంతంలో మహిళలు పురుషులకు సమానం కానే కాదు. కనీసం మనుషులు కూడా కాదు. మహిళలు స్వతంత్రంగా ఉండాలని గాని వీరికి సొంత గుర్తింపు ఉండాలని కాని వారు కోరుకోరు. వారి దృష్టిలో మహిళలు పురుషాధిక్య సమాజాన్ని కొనసాగించడానికి సాధనాలు. ఇదే వారు మహిళల యొక్క అత్యంత కీలకమైన సమస్యలు – ఉద్యోగం, రక్షణ, ఆరోగ్యం, రాజకీయ ప్రాతినిధ్యం తదితర  గురించి పట్టించుకోకుండా చేస్తోంది. బిజెపి యొక్క హిందూ మితవాదుల ఆలోచనలు మహిళలపై జరిగే  అపహరణ, అత్యాచారం, హింస పట్ల ఎలా ఉంటాయో ఈ మధ్యే జమ్మూలోని కథువాలో 8 ఏళ్ల  బాలిక విషయంలో బహిర్గతమయ్యాయి. అందులోని నిందితులంతా హిందువులే. వారు ముస్లింలలోని బాకర్వాల్ జాతిని  భయభ్రాంతులను చేయడానికే ఈ పని చేశారని ఇప్పుడు తెలుస్తోంది. వారిని ఆ గ్రామం నుండి వెళ్లిపోయేలా చేయాలనుకున్నారు. ఈ విషయాలు తెలిసిన స్థానిక హిందూ గ్రూపులు, బిజెపి వారికి అండగానే ఉంటున్నాయి. వారికి మద్దతుగా నిరసన ప్రదర్శన కూడా చేశాయి. ఈ ప్రదర్శనలో పాల్గొన్న ఒక బిజెపి ఎంఎల్‌ఏ ఇప్పుడు జమ్మూ కాశ్మీర్, బిజెపి–పి డి పి మంత్రి వర్గంలో ఉన్నారు.

2019 ఎన్నికలు దగ్గర పడుతున్న సందర్భంలో మోడీ మరోసారి బిజెపి ఆఫీస్ పునాదులతో దాచిన  పనికిరాని వాగ్దానాలను బయటకు తీస్తే ఆశ్చర్యపోనక్కర లేదు. అయితే వాటికి  మళ్ళీ  కొత్త మెరుగులు దిద్ది  పూతలు పూసి  సోకులు చేసి మన ముందుకు తెస్తారు.

❖